క్లుప్తంగా

రమణయ్యపేటలో ఓటర్ల పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్వో సత్యనారాయణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని పాత గైగోలుపాడులో 62వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల జాబితాను కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఓటర్లను పరిశీలించారు. ఓట్ల తొలగింపునకు గల కారణాలు తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మరణాలు, డబుల్ ఎంట్రీ, మరణాలు వలన తొలగించినట్టు బూత్ స్థాయి అధికారులు ఆయనకు వివరించారు. అలాగే పర్మెనెంట్ మైగ్రేషన్ వివరాలు క్షేత్ర స్థాయలో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురార్జీ, డీటీలు వై.శ్రీనివాస్, కె.సురేష్, వీర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి స్వచ్ఛ భారత్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల్లో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్నట్టు సీఎంఓ చామంతి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఒకటో తేదీన స్వచ్ఛత శపథం, 2, 3 తేదిల్లో పారిశుధ్యం, చేతులు కడుక్కోవడం, 4, 5 తేదీల్లో మరుగుదొడ్ల శుభ్రత, మురుగునీటి వాడకం, తాగునీటి వృధా, ఆరో తేదీన మరుగుదొడ్ల వినియోగంపై పోటీలు, 7, 8 తేదీల్లో పాఠశాలల పరిశుభ్రత, పెయింటింగ్, క్విజ్ పోటీలు, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. 11న చేతిగోళ్ల పరిశుభ్రత, 12న స్వచ్ఛతపై ఛాయా చిత్రాల ప్రదర్శన, 13, 14 తేదీల్లో స్వచ్ఛత పక్వాడలో భాగంగా అవగాహన, 15న విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం ప్రారంభించిన ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి సుగుణారెడ్డి

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎస్.సుగుణారెడ్డి పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్త దాన అవశ్యకత తెలియజేశారు. శిబిరంలో భాగంగా 114 మంది రక్తదానం చేయగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, బ్లడ్ బ్యాంక్ ఏవో అప్పలరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.తేజేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయిబాబు సేవలు ఆదర్శవంతం



సాయిబాబును సత్కరిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సలాది సాయిబాబు గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. కాకినాడలోని ఎస్పీ కార్యాలయ అనుబంధ డీసీఆర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన స్వస్థలం కోనసీమ జిల్లా కూళ్ల మల్లవరం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ సాయిబాబును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, 33 ఏళ్లుగా సాయిబాబు పోలీస్ శాఖకు విశేష సేవలందించారన్నారు. ఆదర్శవంతమైన సేవలు అందించిన ఆయనను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఈశ్వరుడు సహా సిబ్బంది ఉన్నారు.

అభ్యుదయ కవి ఆరుద్ర

కాకినాడ రూరల్: అభ్యుదయ కవి ఆరుద్ర జయంతిని సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విశాఖపట్నంలో 1925 ఆగస్టు 31న జన్మించిన ఆరుద్ర అభ్యుదయ కవిత్వ ఉద్యమంలో నిలదొక్కుకుని, సాహితీ ప్రియుల మనసులో చిరస్థాయిగా నిలచిపోయారని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హయగ్రీవ జయంతి

బోట్‌క్లబ్: మేధస్సును ప్రసాదించే హయగ్రీవుని అవతారంలో శ్రీకృష్ణ భగవానుడు పూజలందుకున్నాడు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం స్థానిక దేవాలయంవీధిలోని పురాతన ప్రసిద్ధి చెందిన వేణుగోపాల స్వామికి ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని హయగ్రీవ అవతారంలో అలంకరించారు.

కార్మికా.. ఈ ఘనత నీదే..

- కాకినాడకు జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధనలో పారిశుధ్య కార్మికుల ఘనత
- నేడు వారికి గౌరవ సత్కారం
- మూడు కిలోమీటర్ల మేర అభినందన ర్యాలీ
- పుష్పాభిషేకంతో స్వాగతించనున్న ప్రజలు
- పాల్గొననున్న ఎంపీ, కలెక్టర్, ప్రజాప్రతినిధులు
- ఎమ్మెల్యే సారథ్యంలో నిర్వహణకు ఏర్పాట్లు



కాకినాడ నగరంలో ఒక భాగం

కాకినాడ: ఇండియన్ స్మార్ట్‌సిటీ అవార్డ్స్–2022లో కాకినాడకు పారిశుధ్య విభాగంలో రెండవస్థానం దక్కడానికి కారణమైన పారిశుధ్య కార్మికులకు అరుదైన గౌరవం దక్కనుంది. ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ప్రజారోగ్య పరిరక్షణకు రోడ్లు ఊడ్చి, కాలువలు శుభ్రం చేసి, చెత్తను సేకరించే వారి సేవలకు గుర్తింపుగా ఇటీవల ప్రకటించిన పురస్కారాల్లో కాకినాడ ఖ్యాతి జాతీయస్థాయిలో మార్మోగడంతో వారికి హ్యాట్సాఫ్ చెప్పనున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవ తీసుకుని పారిశుధ్య విభాగానికి సముచిత రీతిలో గౌరవం దక్కేలా రూపకల్పన చేశారు. శుక్రవారం కాకినాడ ప్రాంత ప్రజలను కార్మికులకు అపూర్వ గౌరవాన్ని అందించనున్నారు.

నేడు ర్యాలీ, పుష్పాభిషేకం

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న సుమారు వెయ్యి మంది కార్మికులతో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మెయిన్‌రోడ్డులోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి జగన్నాథపురం నేతాజీ పార్కు వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించనున్నారు. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి జగన్నాథపురం నేతాజీ పార్కు వరకు జరిగే ఈ ర్యాలీలో ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులు, ప్రజలతో కార్మికులకు పుష్పాభిషేకం చేయించి వీరి సేవలను ప్రశంసిస్తూ ప్లకార్డులను ప్రదర్శించనున్నారు. తీన్‌మార్ వాయిద్యాలు కూడా ఏర్పాటు చేశారు. మార్గం మధ్యలో రోడ్డుకు ఇరువైపులా అభినందనలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ర్యాలీ అనంతరం కేక్‌కట్ చేసి కమిషనర్ నాగనరసింహారావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, 14 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సన్మానించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి గురువారం తన కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు.

స్మార్ట్‌సిటీ లోగో

హాజరుకానున్న ప్రముఖులు

ఎమ్మెల్యే ద్వారంపూడి సారథ్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మితో పాటు పలువురు మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు హాజరుకానున్నారు.

సత్కరించుకోవడం అందరి బాధ్యత



దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీలలో కాకినాడ స్మార్ట్ సిటీకి పారిశుధ్య విభాగంలో ద్వితీయస్థానం దక్కడం గర్వించదగ్గ అంశం. గతంలో అత్యంత నివాసయోగ్య నగరంగా దేశంలో నాలుగో స్థానాన్ని సాధించిన కాకినాడ ఇప్పుడు ఈ ప్రాంత ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసేలా శానిటేషన్ (సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్)లో రెండవ స్థానాన్ని సాధించడం హర్షణీయం. ఇందుకు కారణమైన పారిశుధ్య విభాగాన్ని, అధికారులను కాకినాడ ప్రజల తరుపున గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇదే స్ఫూర్తితో పనిచేసి రానున్న రోజుల్లో దేశంలో కాకినాడను నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధన

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని ఉన్న రాఘవేంద్రస్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి 352 ఆరాధన మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సమితి కోశాధికారి వై.వెంకటేష్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఈ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం రాఘవేంద్రస్వామి బృందావనానికి విశేష అలంకరణ జరుగుతుందన్నారు. బ్రాహ్మణులను నూతన వస్త్రాలతో సత్కరించనున్నట్టు తెలిపారు.

ఘనంగా విఖనస జయంతి



లక్ష్మీ హయగ్రీవ అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో విఖనస భగవాన్ జయంతి గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, అర్చన, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. లక్ష్మీ హయగ్రీవ జయంతి సందర్భంగా లక్ష్మీ హయగ్రీవ రజిత అవతారంలో స్వామి వారు దర్శనమిచ్చారు. స్వామి వారికి వైఖానస సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి

గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 45వ డివిజన్ కొండయ్యపాలెం నూకాలమ్మ గుడి ఆలయం నుంచి ఆంజనేయస్వామి విగ్రహం వరకు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర ధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాయకులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ కర్రి శైలజ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, స్థానిక నాయకులు వాకాడ సత్తిబాబు, కర్రి కిషోర్, చిన్న, పార్థసారథి, రామస్వామి, కృష్ణ, పండు, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశం



కరపలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించి, సూచనలిచ్చారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు మంజూరు కాని 298 మంది జాబితాను పరిశీలించి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలు గ్రామాల్లో శిథిలమైన విద్యుత్ స్తంభాలు, గృహాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు తదితర 29 సమస్యలు గుర్తించామని ఎంపీడీఓ కె.అప్పారావు తెలుపగా, వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎంపీ గీత

కాకినాడ: ప్రతిభగల విద్యార్థులకు తనవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందని విశ్వగీతిక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. సీఎస్‌ఈ విద్యార్థిని పి.మణిప్రభకు గురువారం ఆమె ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి ఎస్.విజయ్‌కుమార్, సభ్యులు రావుల మాధవరావు, వంగా విశ్వనాథ్, కొత్తం దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో నా భూమి-నా దేశం

బోట్‌క్లబ్: ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ ప్రతి గ్రామంలోను నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంభాల వేంకటేశ్వరరావు గురువారం విలేకర్లకు తెలిపారు. ప్రతి గ్రామంలోను మట్టి సేకరణ జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో మట్టి సేకరణ యజ్ఞంలా చేపట్టినట్టు తెలిపారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామంలో శుక్రవారం మట్టి సేకరణ ప్రారంభోత్సవం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమ ప్రారంభిస్తారన్నారు.

వేప చెట్టుకు రక్షాబంధన్



వేప చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ఎన్ పాఠశాలలో గురువారం పర్యావరణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ వినూత్న రీతిలో విద్యార్థులచే మొక్కలకు రాఖీలు కట్టించి రక్షాబంధన్ నిర్వహించారు. భూ కాలుష్యం వల్ల అకాలంలో వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటివి వస్తున్నాయని, ఈ వైపరీత్యాల నివారణకు వాహనాల వాడకం వంటివి తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, లక్ష్మి, పద్మావతి, గోవింద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాఖీ పండగ

కరప: సోదరీ, సోదరుల ఆత్మీయానుబంధాన్ని బలోపేతం చేసే రక్షాబంధన్ (రాఖీ) పండగను గురువారం మండల పరిధిలో ఘనంగా జరుపుకొన్నారు. రక్షాబంధనం కట్టించుకున్న సోదరులు కానుకలు ఇవ్వగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు ఒకరికొకరు ఫోన్లలో మాట్లాడుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నారులు రాఖీలు చేతపట్టుకుని వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు. కరపలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావులకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప, వేములవాడ సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

విద్యుత్ ఏఈ పదవీ విరమణ సభలో ఎంపీ గీత



ఏఈ ఆదినారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎంపీ గీత

కాకినాడ రూరల్: ఉద్యోగిగా చేసిన సేవలే పదవీ విరమణ అనంతరం గుర్తుండిపోతాయని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. కాకినాడ, రూరల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో సుమారు 31 ఏళ్ల పాటు విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేసి కాకినాడ రూరల్ డి–4 ఏఈగా పదవీ విరమణ చేసిన నెక్కంటి ఆదినారాయణను ఎంపీ గీత సన్మానించారు. ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని డి కన్వెన్షన్ హాలులో విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆయన పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంపీతో పాటు ఎలక్ట్రికల్ ఎస్ఈ వీవీఎస్ఎన్ మూర్తి, డీఈ ప్రసాద్, ఏడీఈలు గంగాధర్, శ్రీనివాస్, విష్ణుమూర్తి, ఏఈలు, లైన్‌మెన్‌లు, ఇతర సిబ్బంది ఏఈ ఆదినారాయణ దంపతులను సన్మానించారు.








కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు గురువారం రాఖీలు కడుతున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి

ఉప్పాలమ్మకు సామూహిక కుంకుమ పూజలు

- 108 కలశాలతో ముత్తయిదువుల ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కురసాల



కరపలో 108 కలశాలతో ఊరేగుతున్న మహిళలు

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా దుర్గాదేవి ఆలయం నుంచి 108 మంది ముత్తైదువులు కలశాలను తలపై పెట్టుకుని ఆలయం వరకు బాణసంచా కాల్పులతో, గరగనృత్యాలతో తప్పెటగుళ్లతో ఊరేగింపుగా వెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, కలశాలను అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ అమ్మవారి ఫోటో, రూపు, పూజాసామాగ్రి అందజేయగా, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. కన్నబాబు, శ్రీవిద్య దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సీహెచ్ మురళీకృష్ణతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి పూజలు



గురజనాపల్లి షిరిడీసాయిబాబా మందిరంలో సత్యవ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని పలు బాబా ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. గురజనాపల్లిలో ఆలయ వ్యవస్థాపకులు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే పలు గ్రామాల్లో జంధ్యాల పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణులు, వైశ్యులు, రాజులు తదితర సామాజిక వర్గీయులు లక్ష్మీదేవి వద్ద జంధ్యాలను ఉంచి నియమ, నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి జంధ్యాలను మార్చుకున్నారు. మహిళలు దుర్గాదేవికి పూజలు చేశారు.